కథాకళి

# వాడిన పూలు



పాపం పుణ్యం ప్రపంచ మార్గం
కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ
ఏమీ ఎరుగని పూవుల్లారా
మెరుపు మెరిస్తే, వాన కురిస్తే
ఆకసమున హరివిల్లు విరిస్తే
అవి మీకే అని అనందించే కూనల్లారా...

అంటూ మహాకవి శ్రీశ్రీ ఎంత ఆర్ద్రతతో అన్నాడు!

మగాడు తన భార్యకు భర్తగా మాత్రమే ఉంటే-

మగాడు ఒక తండ్రిగా ఒక అన్నగా ఒక స్నేహితునిగా మాత్రమే ఉంటే – మగాడు ఒక మానవుడిగా మాత్రమే ఉంటే-

పాపలు మమతల పాలవెల్లుల్లా ఉండే వారు.

పాపలు సుందర భవితవ్యానికి కనుపాపలుగా ఒదిగేవారు.

పాపలు నెహ్రూ అన్నట్లు నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదిగేవారు.

కానీ-

మగాడు మగాడుగానే మిగిలినందువల్ల కొందరు పాపలు పెనుశాపాలుగా నిలిచారు.

మగాడు మగాడుగానే మసలుతున్నందువల్ల కొందరు పాపలు వాడిన పువ్వుల్లా నలిగారు.

ఆ మగాడికి ఒకే దృష్టి.

ఆ మగాడికి తెలిసిందొకే సృష్టి

ఏ ఆడది కనిపించినా, చివరకు ఎక్కడ ఏ చీర కదలాడినా ఒకే దృష్టి

మగాళ్లంతా అంతేనా?

మానవులంతా అంతేకాదు.

ఒళ్లు బలిసిన మగాళ్లలాగే ఆడవాళ్లూ ఉన్నందువల్లే ఈ లోకంలో ఆ అనాథ బాలికలు. ఒక చీకటి తప్పు ఫలితం ఓ అనాథ బాలిక. ఒక బాధ్యతా రాహిత్యానికి ఓ అనాథ బాలుడు.

ఒక నిరుపేదరికానికి ఓ అనాథ బాలిక. ఒక తప్పటడుగుకు ఓ అనాథ బాలుడు. ఇలా అనాథ బాలలూ, అనాథ బాలికలూ అపురూప బాల్యాన్ని కోల్పోయి, తిండి సుఖాన్ని కోల్పోయి, నిద్ర సుఖాన్ని కోల్పోయి, ఆటాపాటా కోల్పోయి, తల్లిదండ్రుల ప్రేమనూ, అభిమానాన్నీ, వాత్సల్యాన్నీ కోల్పోయి బతుకు కాగితం మీద నిస్సారపు మరకలుగా మారి ఏ అనాథాశ్రమానికో చేరితే- అక్కడా ఓ మగాడు (వెస్లీయో, జానీయో జోనీయో...) వార్డెన్‌గా అధికారపు గీరతో అనాథ బాలికల ఆకాస్త తిండినీ తనే మింగి కొవ్వెక్కిన ఒళ్ళుతో, కైపెక్కిన కళ్ళ జీరతో తనో తండ్రిననే సంగతి మరిచి, పన్నెండేళ్ళ, పదమూడేళ్ళ ఆడపిల్లల్నీ ఆ దృష్టితోనే చూడగలడు.

రోజుకో పాపను తన అనాథాశ్రమం నుంచి ఇంటికి రప్పించుకుని కాళ్ళు పట్టించుకోగలడు. వీపు రుద్దించుకోగలడు. బుగ్గలు నిమిరినట్టు నిమిరి, పాపం పుణ్యం, శ్లేషార్థాలూ తెలియని ఆ అనాథ బాలికలను నిర్దాక్షిణ్యంగా అనుభవించగలడు. తన పుత్రరత్నానికీ అప్పగించగలడు. అనాథలు కాబట్టి తనేం చేసినా తనకు ఢోకాలేదని విర్రవీగగలడు.

వాళ్లలో ఒకటీ అరా బాలికలకు కడు పేద తల్లిదండ్రులో, నిరుపేద దూరపు బంధువులో ఉండొచ్చు. వాళ్లకు తమపై జరిగిన అఘాయిత్యాన్ని చెప్పుకోవచ్చు. అయినా పాపం చేసిన వాళ్ల పాపం పండుతుందన్న హామీ లేదు.

ఎందుకంటే పాపికెప్పుడూ అతని పాపంలో పాలుపంచుకునే వాళ్ళు ఉంటుంటారు. వాళ్లు తమ పాపికి అండగా నిలుస్తారు.

పెట్టిన కేసులు కొట్టిన పిండవుతాయి. ఫిర్యాదు చేసిన పాప చేతే పాపిని పుణ్యాత్ముడనిపిస్తారు. అందుకోసం అదిరిస్తారు, బెదిరిస్తారు.

ఇన్ని జరుగుతున్నా ఈ ప్రపంచం మౌనంగానే ఉంటుందా?

ఉంటుంది మహాప్రభో మౌనంగానే ఉంటుంది. యజమానులు తమ ఆస్తులు పెంచుకోవడంలో నిమగ్నులై ఉంటారు.

ఉద్యోగులు తమ జీతాలు పెంచుకునే పనిలో సతమతమవుతారు.

ఫెమినిస్టులు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పురుష సమాజంపై కత్తులు నూరుతూ తలమునకలై ఉంటారు.

ప్రగతిశీల మహిళా సంఘాలవారు సారావ్యతిరేక ఉద్యమం నడుపుతూ తీరిక లేకుండా ఉంటారు.

అసలే అనాథలైన వాళ్లపై ఏం జరిగినా పట్టించుకునే ఖాళీ ఎవరికి మాత్రం ఎలా ఉంటుంది? ఎవరైనా కొందరు పట్టించుకున్నా పత్రికా ప్రకటనలకే పరిమితమవుతారు.

అంతా ఇలాగే ఉన్నంతకాలం ఆ బాలికలే కాదు, ఈ దేశమే ఓ అనాథ.

28.2.93

ఆంధ్రభూమి దినపత్రిక